

అది ఆర్టీసీ బస్టాండు. కుడివైపు కామారెడ్డి, హైద్రాబాద్ తదితర దూర ప్రాంతాలకు పోయే జనం చేతిలో సూటుకేసులతో బాగా పెరిగిన వేపచెట్టు నీడకు నిలబడ్డారు. ఎడమ వైపు కరీంనగర్, వేములవాడ మరియు పల్లెటూర్లకు పోయే జనం చేతి సంచుల్తోనూ, ఇనుప ట్రంకు పెట్టెల్తోనూ, మరీ పేదవారు ఒక పాత గుడ్డలో వస్తువులనూ, బట్టలనూ కట్టుకొని భుజానికి తగిలించుకొని వచ్చిన బస్సులను చూసి తాము ఎక్కవలసినవి కాక రావలసిన బస్సుల కోసం ఎదురుచూస్తూ, ఓపిక నశించి చెట్టుకింద వేసి వున్న సిమెంటు బెంచిపైన కాస్త స్థలం చేసుకొని కుర్చుంటున్నారు.

# వలస

కుడివైపు, ఎడమవైపు నిలిచే బస్సుల స్థలాన్ని మధ్య వున్న ఆర్టీసీవారి డొక్కు రేకుల షెడ్డు రెండుగా వేరుచేసి వేరు వేరు ప్లాటుఫాంలుగా తీర్చిదిద్దింది. చుట్టూ కాంపౌండ్ గోడ లేకుండానే ఆ వైపు దివరంటూ పాన్ షాప్ డబ్బాలు,





## జూకంటి జగన్నాథం

ఈ వైపు సిమెంట్‌తో కట్టిన దుకాణాలు, హోటళ్ళు కల్సి మధ్య ఖాళీ స్థలంలోని జనాన్ని పారిపోకుండా కాపలా కాస్తున్నట్లు ఒకే వరుసలో అటెన్షన్‌లో నిలుచున్న సైనికుల్లా వున్నాయి.

కొంచెం ఆ మూల పాన్ షాప్‌లకు ఎడంగా జంతువుల కోసం పొంచివున్న సింహంలా 'లైన్స్ క్లబ్‌వారి త్రాగు నీరు' అని రాసిన మినీ వాటర్ టాంక్-దాని కింద నీళ్ళు తాగేందుకు 'నల్లా'.

బస్టాండంతా మధ్యాహ్నం పన్నెండు గంటలైనా రద్దీ గానే వుంది. మనుషులతో, పందులతో, మేకలతో, గాడిదలతో, ముష్టివాళ్ళతో తొడతొక్కిడిగానే వుంది.

కుడివైపు ఒక గుంపు సుమారు పదిమంది కావచ్చు ఒక చోట నిలబడి, కూర్చుని ఎవరికిష్టం వచ్చినట్టువారు న్నారు. ఆ గుంపులో కొట్టొచ్చినట్టు ముతక పాంటు,

1986 అక్షయ దీపావళి కథల పోటీలో రూ.1250/-లు రెండవ బహుమతి పొందిన కథ

షర్ట్ తొడుక్కుని 'రాజేశం' నిలబడి చేతులను తిప్పు కుంటూ మాట్లాడుతున్నాడు. అతని వయసు సుమారు ఇరవై అయిదు సంవత్సరాలు. కానీ కళ్ళ కింద నల్లటి గీతలు - ఎముకలు తేలిన ఛాతీని చూస్తే జీవితాన్ని ఎదు రీదుతున్నవాడని ఇట్టే గుర్తుపట్టొచ్చు.

రాజేశంకు కొంచెం పక్కగా మైసయ్య మోకాళ్ళ మీద కూర్చున్నాడు. మైసయ్య రాజేశం తండ్రి. ఒంటి మీద బనీను - భుజం మీద ఎర్రగీతల తువ్వాలవుంది. పెరిగిన గడ్డంవల్ల ముఖంలోని భావాలను చదవడం కొంచెం కష్టమే. విచారంగా, దిగులుగా, ఏదో పోగొట్టుకున్నవాడిలా వున్నాడు. 'నీ యవ్వ బతుకు ... అనుకొని బాధతో కనుబొమ్మలు ముడేసినట్టే ముడేసి మళ్ళీ అప్పుడే చిన్నగా తనలో తాను నవ్వుకున్నాడు.

బనీను జేబులోంచి సగం తాగి ఆర్పేసి దాచుకున్న కొరుకు బీడీని తీసి వెలిగించాడు. గట్టిగా ఓ దమ్ము లాగి ముక్కులోంచి పొగను వదిలాడు. గుండెలు నిండిన పొగకు ఉక్కిరి బిక్కిరై 'ఖణేల్ ఖణేల్' మని తెరలు తెరలుగా దగ్గి ... దగ్గి ... దూరంగా కాండ్రకించి వుమ్మాడు.

మైసయ్య ఒకసారి వెనకకు తిరిగి అందర్నీ తేరిపార• చూశాడు. ఎవరికివారే అపాయస్థితిలో వున్న రోగి మంచం వద్ద నిలబడినట్లు నిశ్శబ్దంగా, విచారంగా వున్నారు. ఒక్క రాజేశం తల్లి మాత్రం ఇద్దరు చిన్న పిల్లలను అటూ, ఇటూ పోతుంటే అగ్గగ్గో బస్సులు ... బస్సులు వత్తున్నయి అంటూ దగ్గరకు తీసుకొంది.




రెండు నెలలకిందనే పెళ్ళి అయి ఇంటికి వచ్చిన కోడలు — 'ముఖంపైన కొత్తగా పెళ్ళైన కాంతి ఇంకా కనబడుతూనే వుంది. ఇంకా కొంచెం ముందుకని ఇంటి చుట్టుపక్కలోళ్ళు నిలబడి వున్నారు.

మైసయ్య ఏదో జ్ఞాపకం వచ్చి కొడుకునూ, కోడలునూ చూశాడు. అతనికి మనసులో మనసు లేదు. ఎక్కడ

పుట్టిన వూరు - ఎక్కడి సుంచన కోట -

ఎన్నో ఊర్లు

దాటి - తాలూకాలు దాటి - రెండు జిల్లాలు దాటి - కన్నతల్లిలా పెనవేసుకొనే పుట్టిన వూరును దాటి - ఇదిగో ఈ రాజేశం పుట్టిన ఏడాదికి ఈ సిరిసిల్లకు వచ్చాడు.

పుట్టిన వూర్లో తన తండ్రిది ఒక మగ్గం. దాన్నే నేసుకుంటూ వూరిలోని ఇతర కుటుంబాలవారికి అమ్మేవాడు. రైతులు చీరల కింద వడ్లు, కుమ్మరోళ్ళు కుండలు, మిగతా కులాలవారు రూపాయలిచ్చేవారు. తండ్రి చనిపోయాడు. తల్లి రాత్రంతా దీపం ముందు కూచోని కండెలు చుట్టేది. పడుగులు అతికేది. దారం పోగులన్నింటినీ సరిచేసేది. మగ్గం మీదికి సరిగ్గా అందిం

వేది. తను పొద్దు పొద్దంతా తొక్కీ...తొక్కీ... కడుపుల గంజి నోట్లోకి రాంగ ఓ వీర నేసేవాడు. ఇంత కష్టపడినా తిండి ఏ పూట ఆ పూట అన్నట్లే వుండేది.

మైసయ్య తల్లి ముసలిదైంది. పని చేసేది కాని, బాగా అలిసిపోయేది, నీరసంగా వుండేది.

ఒకనాడు తల్లి కండెలు చుట్టుతూ 'వారీ! మైసయ్య నాకిక చాతకాకుంట కావట్టే పెళ్ళి చేసుకో రాదురా' అంది.

మైసయ్యకు ఇన్నినాళ్ళురాని కోరిక మసక మసకగా కళ్ళముందు కదలాడసాగింది.

మూడు నెలలు తిరగక ముందే మేనమామ బిడ్డతో పెళ్ళి అయిపోయింది. పెళ్ళితోపాటు రెండు వందల అప్పు అయింది.

నేసిన వీరలు నేసినట్టు అమ్ముడుపోయేవి ఇంతవరకు - 'కానీ ఈ మధ్య ఒక్కోసారి నెలకు నెలలు రెండు




మూడు జతలు నిలువ వుంటున్నాయి. చేర్యాలలోనూలు ఇచ్చిన షావుకారి పది రూపాయలు అప్పు వుంటే నమ్మడు. ఇక్కడ వీరలు పోవు. ఒక వేళ పోయినా వేళకు డబ్బు చేతికి రాదు.

మైసయ్యకు సంసారం గడవడం కష్టం అయిపోయింది రోజు రోజుకు. పెళ్ళాం నీళ్ళోసుకుని కాన్పుకు రెండు నెలల ముందు పుట్టింటికి పోయింది.

అప్పుడప్పుడే మిల్లు బట్ట ఊళ్ళళ్ళకు దిగుమతి అవుతుంది. మిల్లు బట్ట కట్టుకున్నోళ్లని వింతగా మాస్తున్నారు. ఆ బట్ట ముట్టి చేతిలోకి తీసుకొని మరీ మరీ మాస్తున్నారు. మిల్లు వీరలు కూడా వచ్చాయి. నేత వీరలకు గిరాకీ తగ్గుముఖం పట్టింది.

మైసయ్య పెళ్ళాం పుట్టింటికి పోయేసరికి కండెలు చుట్టేవారు లేక, వున్న తల్లికి సరిగ్గా కనపడక వున్న మగ్గం మూలకు పడినట్లు అయింది.

కొడుకు పుట్టిండనే వార్తా వచ్చింది. చేర్యాల నుంచి డబ్బు కట్టమని షావుకారు పంపిన మనిషి వచ్చాడు. రెండు మూడు రోజులాగి కలుస్తానంటే వీలులేదన్నాడు.

షావుకారుకు వున్న చిన్న ఇల్లు బాకీ కిందికి రాసిచ్చి వచ్చాడు.

రెండు నెలల తర్వాత కొడుకు, భార్య ఇల్లు చేరారు. బోలెడంతా సంతోషంగా వుంది. ఆ సంబరం ఎంతో సేపు నిలువలేదు.

అప్పులకు వడ్డీ కట్టలేక - తిండికి 'గాసం' లేక - చేతికి సరైన పని లేక - బతకడం కనాకష్టంగా తయారైంది.

మైసయ్య రాత్రంతా ఆలోచించి, ఆలోచించి బతుకు తెరువు కోసం వూరు వదిలిపోవాలనే నిర్ణయానికి వచ్చాడు.

మగ్గాన్ని దూలాల మీది కెక్కించి - రాట్నాన్ని అటుక మీద పెట్టి - కడుపు చేత్తో పట్టుకుని ఈ సిరిసిల్లాకు చేరాడు.

మైసయ్యకు గతం జ్ఞాపకం వచ్చి కళ్ళల్లో నీళ్ళు కమ్మినట్లయ్యాయి.

ఆ ఇల్లు, ఈ ఇల్లు తిరిగి తిరిగి ఒక సేటు దగ్గర కూలి పనికి కుదిరాడు.

తను పొద్దంతా నేసేవాడు. భార్య కళ్ళల్లో వత్తులేసుకొని పగలూ, రాత్రి కండెలు చుట్టేది. తను ప్రతిరోజూ ఒక చీర నేసేవాడు. అయినా నెల తిండికే సరిపోయేది. బాకీ కింద రాసిచ్చిన ఇల్లును విడిపించుకుందామంటే నెల నెలా మామూలే. అక్కడికక్కడికే సరిపోయేది సంపాదన.

పుట్టిన వూర్లో ఇల్లు పోయింది. తనను కన్నతల్లి కొడుకు బాధలను చూడలేనని శాశ్వతంగా పోయింది.

మిగిలింది ఇక ఇదే పని -

రాను రాను ఇంకా ఇల్లు గడవడం కష్టం అయిపోతుందే కాని, సుఖం అనే ముచ్చటనే లేదు. కొడుకును నాలుగవ తరగతి పూర్తిగా చదివించేట్టు పరిస్థితి లేదు.

ఒక రోజు రాత్రి పడుకొని ఛాతీ మీద చేతులేసుకొని 'ఏమే! నిన్నే! ఇద్దరం ఇంతగనం పని చేయవడితిమి. ఎదిగిన పిల్లగాన్ని సదివిపిచ్చుట కట్టంగావట్టే - తిండి ఎప్పుడిది అప్పుడే నన్నట్టు కావట్టె - నీ యవ్వ - ఈ బతుకు గిట్ల ఎన్ని దినాలె- మల్లెప్పుడన్నా పండుగత్తె బాకేనాయె - సేటు ఏమో కోపానికి వత్తండు - ఏం చేయాలె - ఎట్లా - అంటూ దీర్ఘంగా ఆలోచనలోపడ్డాడు మైసయ్య.

తళుక్కున ఒక మెరుపు మెరిసింది. మెరిసిన వెలుగుకు కళ్ళు జిగేలుమన్నాయి. బాధలు గట్టెక్కుతాయని మురిసిపోయిండు. ఆ విధం భార్యకు తెలియజెప్పిండు. భార్య మూతి విరిచి - కంట తడి పెట్టి - ముక్కు చీది ఇక చేసేది లేక సరేనని ఒప్పుకుంది.

మైసయ్య వున్న సేటు దగ్గరనే రాజేశం పోగులు అతుకుతూ - కండెల దారాన్ని భీముకు చుట్టుతూ - నెల జీతానికి కుదిరాడు.

అయినా ఎప్పటి కష్టాలు అప్పటివే. ఈ వూరు కూడా పట్టణం ఒంపుసొంపులను సొగసుగా తీర్చి దిద్దుకోవట్టే. సినిమా టాకీసులు - కర్నాటకవారి హోటళ్ళూ ఒకటి పోయి నాలుగు వెలిశాయి. సినిమాలు మొదటి, రెండు ఆటలు పోయి మ్యాట్నీ, మార్నింగ్‌లు హౌస్‌ఫుల్‌గా నడవడం మొదలయింది.

దానికితోడు సాపుదు మగ్గాలు పోయి చక్రం మగ్గాలు వచ్చాయి. చక్రం మగ్గాలు పోయి - కరెంటుతో నడిచే 'లూం' లు వచ్చాయి. వాటికి కండెల మిషన్లూ తోడుగా వచ్చాయి. గవర్నమెంట్ చేనేతకు చేయూత నివ్వడానికి సేట్లకు బ్యాంకులు అప్పులు ఇవ్వడం మొదలయింది.

కాని మైసయ్య బతుకు మసిపారుతనే వుంది. ఎక్కడ వేసిన గొంగళీ అంటే అక్కడే వున్న గొంగళి అన్నట్లు వుంది.

సేట్లు బంగళాలు కట్టిండ్రు, పవర్‌లూం ఫ్యాక్టరీలు పెట్టిండ్రు. 'లూం' ల పైకి భీములను 'పోసే సైజింగ్ ఫ్యాక్టరీలనూ నెలకొల్పారు.

మహారాష్ట్రవాళ్ళు బీడీల కంపెనీలనూ తెరిచారు. మైసయ్య భార్య ఇంట్లో పనిలేక బీడీలను చేయడం నేర్చుకుంది. పొగాకు వాసన మధ్య బీడీల పనికి కుదిరింది.

రాజేశం పవర్‌లూంలు నడపడం నేర్చుకుని పని చేస్తున్నాడు. పనిమంతుడైండని పిల్ల నివ్వడానికి మైసయ్యకు రాయబారాలు వస్తున్నాయి.

చివరికి గవర్నమెంటు ఇచ్చిన పట్టా భూమిలో ఇల్లు కట్టుకుందామని రాజేశంకు రెండు నెలల కింద పెళ్ళి చేశాడు.

మైసయ్య వెయ్యికి బీడి చురుక్కున తగిలేసరికి ఒక్కసారి తేరిపార చూశాడు.

మిగిలేదేమో కాని మళ్ళీ రాజేశంకు బాకీ అయింది. రెండు వేలు-పెళ్ళి చేసుకున్నాడు కాని బాకీ ఎట్లా తీర్చాలని మల్లాగుల్లాలపడ్డాడు. మనసుకు ఏ ఆలోచనా రాలేదు. కొత్త భార్య ఆలోచన తప్ప-చెల్లె తోడు రాగా భార్యతో సినిమాకు కూడా పోయిండు. ఆమెతో చారవగా మాట్లాడే అవకాశం రాలేదు. ఉన్న రెండు

గదులలో ఒక దాంట్లో నాయినా, అవ్వ, చెల్లె, తమ్ముడూ పడుకుంటారు. వంటిల్లు అదే రాజేశంకు పడకటిల్లు. రాత్రి మాట్లాడడానికి వీలు లేదు. బయటకు మాటలు వినిపిస్తాయి. అదిగాక భార్యకు కొంచెం సిగ్గు. దానికి తోడు పగలు బీడీల కంపెనీ లోకే -

అందుకని ఇద్దరి మధ్య సైగలే తప్ప మాటలు తక్కువ. మాట్లాడినా ఏ గోడకో, ఇంటి కప్పుకో చెప్పుతున్నట్లు మాట్లాడుకునేవారు.

మనసు విప్పి మాట్లాడుకోనేలేదు. పూర్తి సిగ్గులు, బిడియాలు పోనే లేదు. పెళ్ళి అయిన పదిహేను రోజులకే ఆషాఢమాసం వచ్చింది.

రెండు వేల అప్పు గురించి మరచిన రాజేశంకు తీరిక దొరికే సరికి మరల అప్పు ఆలోచన వచ్చింది. రాజేశం తండ్రితో ఆలోచించాడు. తల్లితో చెప్పాడు. ఏం చేద్దామని. తల్లి, తండ్రి ఇద్దరూ సరైన సమాధానం చెప్పలేక పోయారు.

ఏదో పవర్ లూంలు సరిగ్గా నడుపుకొని భార్య చేసిన బీడీలతో వచ్చిన డబ్బు అప్పు కింద కడదామన్నా - గవర్నమెంటు ఇచ్చిన స్థలంలో చిన్న ఇల్లు కట్టుకోవాలనే జోరీగ ఆలోచన.

రాజేశం పవర్‌లూం నడిపే వద్ద తనకన్నా అయిదేళ్ళు పెద్దవాడయిన స్నేహితునితో ఈ విషయం చెప్పాడు.

'ఇక్కడ వచ్చే నాలుగైదు వందలతో నీ అప్పు తీరదు. ఇల్లూ కట్టవు. కాబట్టి భీవండికి ఓ సంవత్సరం పోయివస్తేసరి. అక్కడ ఇదే పని కాని, ఇక్కడి లెక్క తేపతేపకు కరెంటుపోదు, ఎప్పటికో పోగులు తెగిపోవు పైగా కూలీ ఎక్కువే. చేసినంతసేపు పని బాగా అయితది. ఓ వెయ్యి రూపాయిల వరకు నెలకు వస్తయి. మరి ఆలోచించుకో' అని సలహా ఇచ్చాడు.

రాజేశం ఆలోచించి భీవండికి పోవాలనే నిర్ణయానికి వచ్చాడు.

తల్లి, తండ్రీ ససేమిరా వద్దన్నారు. కొత్తగా పెళ్ళి అయిందని వారించారు, కోప్పడ్డారు.

రాజేశం నిర్ణయం మారలేదు. భార్యను అత్తగారింటి దగ్గరి బీడీల కంపెన్ల నుండి పిలిచి విషయం విడమరచి చెప్పాడు. వద్దంటే పోనన్నాడు. చివరికి ఆమె సరేనంది.

ఇదిగో ఇప్పుడు రాజేశం భీవండికి తయారయి బొంబాయి బస్సుకు పోదామని బస్టాండుకు వచ్చాడు.

'రాజేశం! వారీ! బస్సు వచ్చే యాళ్ళయిందా కొడుకా!' మైసయ్య పొద్దు పొడుపుకు చెయ్యి అడ్డం పెట్టి చూస్తూ అడిగాడు.

'ఆ ! వేములాడకు పోయిందే - ఇగ పది పదియేను నిమిషాల్లల్ల వత్తది' రాజేశం సమాధానం చెప్పాడు.

'నాయినా! పయిలం. బిడ్డా! ఎన్నడూ మమ్మల్నిడిసి ఏ వూరూ పోలేదు. కొడుకా! ఈ కట్టం మన కెల్లచ్చే కొడుకా! అంటూ తల్లి రాజేశంను దగ్గరికి తీసుకొని శోకం పెట్టింది.

రాజేశంకు కళ్ళల్లో నీళ్ళు.సుళ్ళు తిరుగుతున్నాయి. నిజంగానే కన్నోల్లను విడిచి ఎప్పుడూ పోలేదు.

'అవ్వా! నూవ్వూకోయే. ఊకో. నాకేంది. మంచిగనే వుంటలేయ్యి' తల్లిని సమాధానపర్చిండు.

అత్త ఏడ్చేసరికి దగ్గరికి వచ్చిన భార్య ముఖం చూసిండు రాజేశం. కళ్ళకింది నుంచి చూసి చూడనట్లు చూస్తుంది. రాజేశం భార్యకేదో చెప్పాలనుకొని చెప్పబోయాడు. చెప్పలేకపోయాడు. ఇద్దరి మధ్య అంత స్వేచ్ఛగా మాట్లాడుకునే చొరవలేదు.

ఆమెను చూడగానే నవ్వు వచ్చి పెదవి చివరిపై మెరిసి మాయమయింది. ఆమెగమనించినట్లుంది. ఆమె దొరగా నవ్వి ఓరగా చూసింది.

ఇంకా ముఖంపై పెళ్ళి కళ పోనేలేదు.

'వారీ రాజేశం పయిలం నాయినా! భీవండిల మంచోల్లతోని కల్సి తిరుగు. అల్లాటప్పాగాల్లతోని దోస్తాని చేయకు. సంపాయించిన కాడికాయె, చెత్తె యినకపోతివి. నాయినా! తినంగ మిగిలినయెనాయె. ఎక్కువపనిచేయకు. మంచిగ వుండి వత్తె అదే చాలు' అని చెప్తూ మైసయ్య బాధ గుండెలకు అడ్డంపడగ కళ్ళల్లో కొచ్చిన నీటి పొరను తువ్వాలతో ఒత్తుకుని కొడుకుని చూశాడు.

కొడుకు పెళ్ళి చేసుకొని రెండు నెలలు కాకముందే భీవండి పోవుడు తప్పకపాయే. తనన్నా పెండ్లి అయి కొడుకు పుట్టిన తర్వాత ఇక్కడికి బతకవచ్చాడు. కాని వీడు పెళ్ళి కాగానే ఏ అచ్చట ముచ్చట పూర్తి తీరక ముందే వేరే నగరం పోవట్టె.

బొంబాయి బస్సు రానే వచ్చింది. రాజేశం పేరు పేరున అందరికీ చెప్పిండు, భార్యకు తప్ప. బస్సెక్కి డోరు వద్ద నిలబడ్డాడు. బస్సు స్టార్టు చేసే వుంది.

తల్లి, చెల్లి, తమ్ముడు, తండ్రి అందరూ చేయిల చేయి కలుపుతూ బోరున ఏడుస్తున్నారు. పట్టణం ఇనుప కౌగిలి లోంచి నగరం రాక్షసి నోట్లోకి పోతున్న రాజేశంను తల్చుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్నారు.

భార్య కొంచెం దూరం నిలబడి ఏకధాటిగా ఏడుస్తూనే వుంది. 'మంచిగ వుండు' అని చెబుదామనుకొని రెండు అడుగులు ముందుకేసి ఆగింది.

కండక్టరు రైట్ అని చెప్పడంతో బస్సు మెల్లిగా కదలసాగింది.

రాజేశంకు కూడా ఏడుపు వస్తుంది. భార్య కన్నీళ్ళను తుడిచి వారించాలనుంది. కాని, రాజేశంకు చెప్పరానంత దుఃఖం వరద గోదావరిలా తన్నుకు వస్తుంది.

'అవ్వా! రాధాబాయిని మంచిగ చూసుకోండి' భార్య గురించి చెప్పాడు.

బస్సు వేగాన్నందుకుంది, ఏడ్చేవారి కళ్ళల్లో దుమ్ము కొట్టి —

# ఆహ్వానము

కాంతి ఖడ్గమ్ము పూని లోకాలపైని
తాండవించెడు తమము నంతంబుచేసి
పున్నమిని సృష్టి చేయగా బూనినాము
రండు! విస్ఫూర్తితో చకోరకములార!

దివ్వెలాయవి? పరాధీనత లేక శో
　　　　భిల్లు విజ్ఞాన దీప్తికలు కాని!
మువ్వలాయవి? రాక్షసుల ముట్టు పెట్టగా
　　　　సాగెడు దివ్యాస్త్ర చయము కాని!
పువ్వులాయవి? భూ నభో వీధులందున
　　　　రవ్వలై నిలుచు తారకలు కాని!
నవ్వులాయవి? నవనాదంబు వేదమై
　　　　వినదించునట్టి వీణియలు కాని!
జగతిన జ్ఞాన తిమిరంబు సమసి పోవ
రాక్షసత్వంబు కోరలు రాలి పోవ
నవ్వులే పువ్వులగుచు పున్నమి జనించె
సౌరమతులార రండు! దీక్షలు ఫలించె!

—ఎం.పి. జానుకవి